2024 సార్వత్రిక ఎన్నికలు

# పందెం కోళ్ళు... గెలుపు గుర్రాలు

**2024** ఎన్నికలలో, బూర్జువా పార్టీల వ్యూహ ప్రతి వ్యూహాలు, పందెం కోళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. ఆయా పార్టీల ప్రతిష్టను కిందిస్థాయి నుండి విస్తరించడానికి కృషి చేసిన వారిని, అధినాయకులు కోరుకోవడం లేదు. ఎవరైతే వారి పార్టీ అగ్ర నాయకుల వీధి ప్రదర్శనల కోసం, బహిరంగ సభల కోసం తమ డబ్బును భారీగా వెచ్చించి, ఈ కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహిస్తారో... వారినే ఇష్టపడుతున్నారు. బూర్జువా పార్టీల చూపులన్నీ పందెపు కోళ్ల మీదున్నాయి. విదేశాలలో నివసిస్తూ... వందల కోట్ల అధిపతులుగావున్న పందెపు కోళ్ల కోసం వారు వెదుకులాడుతున్నారు.

అన్ని బూర్జువా పార్టీల అధిష్టానాల విధానమంతా ఒక్కతీరుగానే ఉంది. క్రిందిస్థాయిలో తమ తమ నియోజకవర్గాలలో గట్టిగా శ్రమించిన నాయకులందరి పరిస్థితే విచారకరంగా ఉంది.

ఆయా నియోజకవర్గాలలోని కుల సమీకరణల ప్రాతిపదికగా లేదా అధికార పార్టీ అభ్యర్థి సామాజిక, ఆర్థిక హోదా ప్రాతిపదికగా అభ్యర్థుల ఎంపిక కోసం విపక్ష పార్టీలు చూస్తున్నాయి. ఈ రకమైన ప్రయత్నాలలో వారి వారి పార్టీలలోనే నిరసనలు, అలకలు, పార్టీ ఫిరాయింపులు... చోటు చేసుకుంటున్నాయి. ఫ్యూడల్ ఆధిపత్య స్వభావంతో ఒక సమగ్ర వ్యక్తిత్వం ఉన్నవారు కూడా, అభ్యర్థిగా నిలిచేందుకు, ఇతర పార్టీల్లోకి దూకుతున్నారు. అనేక సంవత్సరాలుగా తాము ప్రయాణించిన పడవ నుండి దూకేయటానికి వారు సంసిద్ధమై ఉన్నారు.

ఈనాటి వరకు ప్రజాస్వామికవాదులుగా, అభ్యుదయ వాదులుగా పిలవబడుతూ ఉన్న మరికొందరు కూడా, మర్నాడే ప్రతిఘాతుక, మతతత్వ పార్టీలను పైకి ఎత్తుతూ వానిలో చేరిపోతున్నారు. ఇదే... మనమంటున్న బూర్జువా రాజకీయ సంస్కృతి అంటే! ఒక దోపిడీ వ్యవస్థలో, దోపిడీ వర్గాలన్నింటి విధానాలన్నీ ఒకేలా ఉంటాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మహిళా రిజర్వేషన్ కోటాల ప్రకారం ఏ పార్టీ అయినా రిజర్వ్‌డ్ విభాగంలోని స్థానాలకు సంబంధిత అభ్యర్థులను మాత్రమే పోటీకి నిలపాలి.

ఈ రిజర్వ్‌డ్ స్థానాల్లో అభ్యర్థులు, తమ సాంప్రదాయాల పట్ల స్వాభావికమైన ప్రేమను కలిగి ఉండవచ్చు... ఆ విభాగపు ప్రజల శ్రేయోభిలాషులుగా ఉండాలనే మానసిక ప్రవృత్తిని కలిగి ఉండవచ్చు. అయితే, వారి సేవలు బూర్జువాలకే, పాలకవర్గాలకే ప్రయోజనం చేకూరుస్తున్నాయి. వారి వర్గానికి, జాతులకు వారేమీ చేయటం లేదు కానీ, పిడికెడు మందిగా ఉన్న బూర్జువాలకు, వారి సిద్ధాంతం శాశ్వతంగా కాలూనుకునేందుకు మాత్రం తోడ్పడుతున్నారు. బూర్జువా పార్టీలన్నీ వెనకబడిన కులాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల నుండి అభ్యర్థులను మోహరించేందుకు పోటీ పడుతున్నాయి.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో దశాబ్ద కాలంగా ఆర్థిక మంత్రిగా బూర్జువా వర్గాలకు సేవ చేసిన నిర్మలా సీతారామన్, ఎక్కడ నుండి పోటీ చేస్తారనేది అనిశ్చితంగా ఉంది. ప్రసార మాధ్యమాల చర్చల సందర్భంగా ఎన్నికలలో ఆమె పోటీ చేయటం గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, “పోటీ చేయటానికి అవసరమైన తరహా డబ్బు నా వద్ద లేదు... విజయావకాశాలకు ప్రాతిపదికగా ఉపయోగించే వివిధ ఇతర అంశాల గురించి కూడా ఒక సమస్య వుంది...నా జీతం, నా సంపాదన, నా మదుపు నాది మాత్రమే, భారత సమీకృత నిధికి చెందినది కాదు....” అని పేర్కొంది. ఆర్థికంగా సమర్థత లేకపోవడమే వాస్తవిక కారణమా?

బిజెపి జాతీయ నాయకుడు జీవీఎల్ నరసింహారావు, నిధుల కొరత కారణంగానే ఎన్నికలలో పోటీ చేయడం లేదనే వార్త ప్రచారంలో ఉంది. విస్తారమైన ధనరాశులను కలిగిన పందెపు కోళ్లు... గెలుపు గుర్రాలు మినహా, మరెవరూ అభ్యర్థులుగా పోటీ పడలేరని ఈ పరిణామాలు తెలియజేస్తున్నాయి.

నిన్నటిదాకా టిడిపి రాజ్యసభ సభ్యులుగా ఉన్నవారు రాజీనామా చేసి బిజెపిలో చేరారు. బిజెపి యొక్క ఏ విధానాలనూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదని వారు పేర్కొనడం, బూర్జువా రాజకీయ పార్టీల విధానాల నడుమ భేదమేమీ లేదని తెలుపుతోంది. కనుక, రెండు పార్టీలకు తేడా ఏముంది?! వారంతా ఒకే గూటి పక్షులు. అందువలనే వారంతా ఒకేతరహా బూర్జువా నీతి సూత్రాలతో కొనసాగలుగుతారు.

కనుక, పిడికెడు మంది బూర్జువాల నీతి సూత్రాలు, సంస్కృతి, పందెపు కోళ్ళ కోసం... గెలుపు గుర్రాల కోసం ప్రేరేపిస్తూ, ‘నీవు ఒక సేవకునిగా ఉండు... నీ శక్తి సామర్థ్యాలు, సంపాదనంతా వెచ్చిస్తూ ఒక విశ్వాస పాత్రమైన పావుగా ఉండు. మేము నిన్ను జాగ్రత్తగా చూసుకుంటాము కదా’ అంటున్నారు. దోపిడీవర్గాలు రాజ్యాంగ ధర్మాలను పరిరక్షిస్తాయని ఊహించటానికి మించిన పిచ్చితనం మరొకటి ఉండబోదు.

నీతి బాహ్యమైన వ్యక్తి, కోతి కంటే హీనం. ఇది అన్ని బూర్జువా పార్టీలకు సరిగ్గా సరిపోతుంది.

**(2024 ఏప్రిల్ ‘క్లాస్ స్ట్రగుల్’ సంపాదక వ్యాఖ్య)**

*****